andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3; కనిష్ఠం 21.7

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్ జిల్లా వార్తలు

3

మంగళవారం 5 మార్చి 2024





పచ్చ బంగారానికి భారీ డిమాండ్!

- అంతర్జాతీయంగా జిల్లా పసుపునకు గుర్తింపు
- ఉత్తరాది రాష్ట్రాలతోపాటు గల్ఫ్ దేశాలకూ పసుపు ఎగుమతులు
- సాగు విస్తీర్ణం తగ్గడంతో భారీగా పెరిగిన కొనుగోళ్లు
- పసుపు కొనేందుకు పోటీ పడుతున్న వ్యాపారులు
- గ్రామాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- గత సంవత్సరం కంటే భారీగా పెరిగిన పసుపు ధర
- కొత్త రికార్డులు నమోదు చేస్తున్న పసుపు ధర
- డిమాండ్ ఉండడంతోనే మంచి ధర: మార్కెట్ కార్యదర్శి వెంకటేశం

నిజామాబాద్, మార్చి4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పసుపునకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఈయేడు పసుపు సాగు తగ్గడంతో డిమాండ్ భారీగా పెరిగింది. ఉత్తరాది రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్, గల్ఫ్‌దేశాలకు ఎగుమతులు చేస్తుండడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గిపోవడం పసుపు మార్కెట్‌కు గత సంవత్సరం లాగే వచ్చే అవకాశం లేకపోవడంతో వ్యాపారులు ఎక్కువమంది ముందుకు వస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో వ్యాపారులు ఎక్కువగా మొగ్గుచూపడంతో ఇక్కడి వ్యాపారులు మార్కెట్‌తో పాటు గ్రామాలకు వెళ్లిరైతుల నుంచి పసుపు కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ ఉన్న రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. నిజామాబాద్ మార్కెట్‌లో ప్రతీ సంవత్సరం పది లక్షల నుంచి 15లక్షల క్వింటాళ్ల మధ్య అమ్మకాలు జరుగగా ఈ సంవత్సరం అందులో సగం కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో ముందస్తుగానే వ్యాపారులు ఈ కొనుగోళ్లను చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ అధికారులతోపాటు వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

పడిపోయిన పసుపు సాగు విస్తీర్ణం

గత కొన్నేళ్లుగా ధర రాకపోవడం, అధిక వర్షాలతో పసుపు సాగు గణనీయంగా పడిపోయింది. రాష్ట్రంతోపాటు ఏపీ, మహారాష్ట్ర, అస్సాం, తమిళనాడుతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా పసుపు విస్తీర్ణం పెరగలేదు. గత ఐదేళ్లలో వేసిన పంటలో సగం వరకే సాగు చేయడంతో ఈ యేడాది మార్కెట్‌కు ఎక్కువగా పసుపు వచ్చే అవకాశం లేకపోవడంతో వ్యాపారులు ఎక్కువ మొత్తంలో కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పసుపు ఎగుమతులు కూడా పెరగడం వల్ల డిమాండ్ పెరిగింది. బంగ్లాదేశ్‌తోపాటు గల్ఫ్‌దేశాలకు పసుపు ఎగుమతి అవుతుండటంతో వ్యాపారులు ఎక్కువమొత్తంలో కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. పసుపు నిల్వలు కూడా వ్యాపారుల దగ్గర తక్కువగా ఉండటం ఈయేడు సాగు విస్తీర్ణం ఎక్కువగా లేకపోవడంతో డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం పసుపు 80వేల ఎకరాల వరకు సాగయ్యేది. ఈ సంవత్సరం అన్ని జిల్లాలు కలిపి 36వేల ఎకరాలకు మించి సాగు కాలేదు.

ఈయేడు 19వేల 500 ఎకరాల్లో సాగు

జిల్లాలో ప్రతీ సంవత్సరం 40వేల నుంచి 50వేల ఎకరాల మధ్య పసుపు సాగయ్యేది. అయితే ఈ సంవత్సరం 19వేల 500 ఎకరాల్లో మాత్రమే పసుపు సాగైంది. గడిచిన ఐదేళ్లుగా పసుపునకు ధర లేకపోవడం పెట్టుబడి ఎక్కువగా పెరగడంతో రైతులు కూడా ఇతర పంటలకు మారారు. పసుపు సాగును తగ్గించుకున్నారు. ఒకేసారి పంట విస్తీర్ణం తగ్గిపోవడం డిమాండ్ పెరగడంతో వ్యాపారులు కూడా పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో వినియోగం ఎక్కువ గా ఉండటం డిమాండ్ ఎక్కువగా వస్తుండటంతో అక్కడి వ్యాపారులతో ఒప్పందాలు చేసుకొని కొనుగోలు చేస్తున్నారు. అక్కడికి అవసరమైన పసుపును నిజామాబాద్ మార్కెట్‌లో కొనుగోలు చేసి పంపిస్తున్నారు. మరో నెల రోజుల వరకే పసుపు ఎక్కువగా మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉండటంతో వ్యాపారులు కూడా పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే పసుపుతోపాటు నేరుగా గ్రామాలకు వెళ్లి రైతుల వద్ద కొంతమంది వ్యాపారులు ఈ పసుపును కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి

ఎకరా పసుపుకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి కావడం, కూలీలు కొరత ఉండడంతో రైతులు ఇతర పంటలు వైపు దృష్టిసారిస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా మార్కెట్‌లో పసుపు ధర పెరగలేదు. క్వింటా 4వేల నుంచి 8వేల మధ్యే అమ్మకాలు జరిగాయి. ఈ ఐదేళ్లలో పసుపు క్వింటా 4వేల నుంచి 6,500 మధ్యే ఎక్కువగా జరిగాయి. పెట్టుబడి కూడా కొన్నిసార్లు రాకపోవడం, దిగుబడి తగ్గడంతో కొంతమంది రైతులు నష్టపోయారు. కూలీల సమస్యలను ఎదుర్కొన్నారు. పంట వేయడంతో లాభం లేకపోవడం సంవత్సరం కష్టపడినా గిట్టుబాటు రాకపోవడంతో సాగును తగ్గించారు.

కేంద్రం చర్యలతో పెరిగిన ధర

కేంద్ర ప్రభుత్వం ఎగుమతులకు అవకాశం ఇవ్వడం, సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో ఈయేడు పసుపు ధర భారీగా పెరిగింది. గడిచిన 3 నెలలుగా ఈ ధర పెరుగుతూ వస్తోంది. డిసెంబర్ నెలలో పసుపు క్వింటాలు 11వేల వరకు అమ్మకాలు జరుగగా, జనవరి నెలలో 12వేల వరకు ధర పలుకుతోంది. ఫిబ్రవరిలో క్వింటా రూ.14,500 వరకు అమ్మకాలు జరిగాయి. సరాసరి ధర కూడా పెరిగింది. గత సంవత్సరం క్వింటాకు రూ.4వేల ధర నుంచి మొదలు కాగా, ఈ సంవత్సరం క్వింటాకు రూ.8వేల నుంచి మొదలవుతోంది. రైతులకు సాధారణంగా క్వింటాకు రూ.10 నుంచి 13వేల మధ్య అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో మార్కెట్‌కు వచ్చిన రైతులకు ధర రాక మూడు, నాలుగు రోజులపాటు వేచి ఉండేవారు. ప్రస్తుతం తెచ్చిన రోజే ధర ఎక్కువగా పలకడంతో అమ్మకాలను చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లతో పోలిస్తే పసుపు ధర రెండింతలు పెరిగింది. ఈ సంవత్సరం పసుపు దొరకే పరిస్థితి లేకపోవడంతో ఈ వ్యాపారం చేసే రైతులు కూడా నిలువ పెట్టుకునేందుకు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. సంవత్సరం పాటు డిమాండ్ ఉండే అవకాశం ఉండటం వల్ల ముందస్తుగానే పసుపు కొనుగోళ్లను చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎగుమతులను ప్రోత్సహించడం, ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటం వల్ల పసుపుకు భారీ ధర వస్తున్నట్లు మార్కెట్ అధికారులు అంచనా వేస్తున్నారు. మరో నెల రోజుల వరకే పసుపు ఎక్కువగా మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉండటంతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సాగు విస్తీర్ణం తగ్గిపోవడం డిమాండ్ ఉండటం వల్ల ధరలు కూడా భారీగా పెరిగాయని మార్కెట్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన పసుపునకు మంచి ధర వస్తుందని పేర్కొన్నారు. రైతులు అమ్మకాలు జరుపుకునేందుకు అన్నివిధాలా ఏర్పాట్లను చేశామని ఆయన తెలిపారు.

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

- ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యను పరిష్కరించాలి: కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- ప్రజావాణికి 131 వినతులు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మార్చి4: అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని, ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువలా వచ్చాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయా సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, అదనపుకలెక్టర్ అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ అదనపు కలెక్టర్ కిరణ్మయి, డీఆర్‌డివో సాయగౌడ్‌లకు వినతులు సమర్పించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మా ట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారంలో పురోగతిని ఫిర్యాదు దా రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాల్లోనే అధికారులు బస చేయాలి

జిల్లాస్థాయి అధికారులు ప్రభుత్వ వసతిగృహాల్లో బస చేయాలని, బోధన్ హాస్టల్‌లో హత్యకు గురైన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణా విద్యార్థి ఉద్యమ వేదిక, గిరిజన విద్యార్థి సంఘం, తెలంగాణా స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి పత్రం అందచేశారు. విద్యార్థి వెంకట్ హత్యకు గురికావడంలో హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం ఉందని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో లాల్‌సింగ్, జైత్రామ్‌రాథోడ్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి

జిల్లాలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా వాటిని లబ్ధిదారులకు అప్పజెప్పకపోవడంతో అవి అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని, వెంటనే వాటిని అర్హులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- నగరంలో రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి4: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, ఒత్తిడి దూరమవుతుందని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ పోటీల్లో భాగంగా ఫుట్‌బాల్, టగ్‌ఆఫర్, అథ్లెటిక్స్ క్రీడలను నగరంలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. ప్రతీ రోజు వ్యాయామం చేయడం ద్వారా దృడంగా ఉండాలని అప్పుడే మనం ప్రతీ రోజు చేసే పనిలో ప్రతిభ చూపించగలుగుతామని అన్నారు. పని ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు దోహదపడతాయని ప్రతీఒక్కరు క్రీడల్లో పాల్గొన్నాలన్నారు. క్రీడలకు వయసుతో సంబంధం లేదని, వీలైనప్పుడల్లా క్రీడలతో మానసిక ప్రశాంతతను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఆపరేషన్ రవీందర్, ట్రాన్స్‌కోసీఈ శ్రీరాంప్రసాద్, జగన్నాథ్, రమేష్‌బాబు, సూర్యనర్సింహారావ్, గోపి, తోటరాజశేఖర్ ఉన్నారు.



- కామారెడ్డి జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా సిజేరియన్లు
- అవసరం లేకున్నా కడుపు కోతలే..
- మొదటి కాన్పు సాధారణ ప్రసవం చేయాలని సర్కారు ఆదేశాలు
- బేఖాతరు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు
- సిజేరియన్లతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న తల్లీబిడ్డలు

కోతలకే మొగ్గు!



కామారెడ్డి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): సాధారణ కాన్పులు పెంచడంలో ప్రైవేట్ ఆసుపత్రులు నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఆదేశించినా కాసుల కక్కుర్తితో ప్రైవేట్ ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా సీజెరియన్ డెలవరీలు చేస్తున్నారు. ఓవైపు ఆసుపత్రి ఖర్చులు, శస్త్ర చికిత్స తర్వాత మహిళలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. శస్త్రచికిత్స చేస్తేనే ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహకులకు కాసుల గలగల ఉండనుండడంతో ఆ దిశగానే కాన్పులు చేస్తున్నారు. సాధారణ కాన్పుల వైపు దృష్టిసారించడం లేదు.

ఇష్టారీతిన సీజెరియన్లు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడలలో గల పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇష్టారీతిన ప్రసవ కోతలు జరుగుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. వైద్యులు ముందు నుంచి సన్నద్ధం చేయకపోవడం గర్భిణీ కుటుంబీకులు సాధారణ ప్రసవానికి ముందుకు రాకపోవడం ఇతరత్రా కారణాల అందుకు దోహదం చేస్తున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ తరుణంలో వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాసుల కక్కుర్తితోనే..

జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో రెండున్నర లక్షలకు పైగానే ప్రసవాలు జరగగా.. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 1లక్షకు పైగా, సిజేరియన్‌లు 40వేల వరకు జరిగాయి. ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 30 వేలు చేయగా.. సిజేరియన్లు 70వేలకు పైగా చేశారు. ఈ లెక్కలను పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న సిజేరియన్ల తీరు అర్థం చేసుకోవచ్చు. కేసీఆర్ కిట్ తర్వాత నుంచి ప్రైవేట్ ఆసుపత్రుల ధనార్జన కొంత తగ్గిపోవడంతో ఆపరేషన్లకే మొగ్గుచూపుతూ అధికారుల కళ్లు కప్పేందుకు తూతూ మంత్రంగా నార్మల్ డెలివరీలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు సరిగా లేకపోవడం బెడ్లు సరిపడా లేకపోవడం, డాక్టర్ల కొరత, సిబ్బంది కొరతతో డెలివరీలు చెయడం ఆలస్యం అవుతుండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఇలా వెళ్తున్న వారిని వదిలిపెట్టకుండా అవసరం లేకున్నా డబ్బులు ఆర్జించేందుకే సీజేరియన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లపై వైద్యఆరోగ్యశాఖ పకడ్బందీగా చర్యలు తీసుకుంటేనే శస్త్రచికిత్సలు తగ్గే అవకాశం ఉంది. లేదంటే కాసుల కోసం ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు ఇష్టారీతిన సిజేరియన్లతో మహిళల ఆరోగ్యంతో ఆడకునే ప్రమాదం ఉంది.

సిజేరియన్లతో కలిగే అనర్థాలు

సిజేరియన్లు చేయడంతో మహిళల్లో పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ డెలివరీలో పుట్టే చిన్నారుల కంటే సిజేరియన్లలో పుట్టే చిన్నారులకు అనేక రకాలైన సమస్యలు ఏర్పడుతాయని అంటున్నారు. అలాగే శస్త్రచికిత్స జరిగేప్పుడు రక్తం ఎక్కువగా పోవడంతో మహిళలకు ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా సాధారణ ప్రసవం అయినవారితో పోలిస్తే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. సిజేరియన్ చేసే ముందు గర్భిణీకి మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో శస్త్రచికిత్స తర్వాత పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. సిజేరియన్ చేసుకున్న మహిళల్లో వెన్నునొప్పులతో ఎక్కువశాతం ఇబ్బందులకు గురవుతారు. మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు ముందస్తుగా గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకునేలా ఆ లోచించాలని పలువురు వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల బేఖాతారు

గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తూ అనేక రకాల నిబంధనలు తీసుకువస్తున్నా అవి కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది. వాటిని అమలు చేయాల్సిన అధికారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న సిజేరియన్లకు సంబంధించిన లెక్కలను చూసి కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా ఉంటూ తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రసవాలు జరుగుతున్న తీరుపై పలు సూచనలు చేయగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసరమైతేనే సిజేరియన్‌లు చేస్తుండగా ప్రైవేట్ ఆసుపత్రుల తీరు మాత్రం మారడం లేదని తెలుస్తుంది. మొదటి కాన్పు కచ్చితంగా సాధారణ ప్రసవమే చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ బేఖాతరు చేస్తున్నారనే వాదనలు లేకపోలేదు.

బంధువు అంత్యక్రియలకు వెళ్తూ.. అనంతలోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం

● కామారెడ్డి జిల్లాలో ఘటన



జనార్దన్‌రెడి(ఫైల్) ప్రతిభ(ఫైల్

సదాశివనగర్, మార్చి 4: బంధువు అంత్యక్రియలకు వెళ్తూ.. రోడ్డు ప్రమాదం బారిన పడి దంపతులిద్దరూ మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. సదాశివనగర్‌కు చెందిన ఏనుగు జనార్దన్ రెడ్డి(47), ఏనుగు ప్రతిభ (36) భార్యభర్తలు. వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో.. సోమవారం అంత్యక్రియలకు భార్యభర్తలు కలిసి స్కూటీపై వెళ్లారు. పద్మాజీవాడి యూటర్న్ వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక వైపు నుంచి అతి వేగంతో ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి ఎగిరి ఇద్దరూ కింద పడ్డారు. అదే సమయంలో ఎగిరి కింద పడిన ప్రతిభపై నుంచి భారీ వాహనం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే నుజ్జునుజ్జై మృతి చెందింది. జనార్దన్‌రెడ్డి కాలుపై నుంచి సైతం వాహనం వెళ్లడంతో 75శాతం కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. తీవ్రగాయాలైన జనార్ధన్‌రెడ్డిని వెంటనే హైదరాబాద్‌కు తరలించి కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించిన కొద్ది సేపటికే తుది శ్వాసవిడిచాడు. జనార్థన్‌రెడ్డి దంపతులకు ఇద్దరు సంతానం కాగా.. పెద్ద కొడుకు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. చిన్నకొడుకు ఇంటర్ చదువుతున్నాడు. కాగా.. అందరితో కలుపుగోలుగా ఉండే దంపతులు రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడంతో.. బంధువులతో పాటు గ్రామస్తులూ శోక సంద్రంలో మునిగిపోయారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి, మార్చి 4: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన పండారి లక్ష్మణ్(57) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. లక్ష్మన్ గత కొన్నిరోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడట్లు తెలిపారు. ఈ విషయమై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలి

కోటగిరి, మార్చి 4: గ్రామాలలో ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో గ్రామాల వారిగా ఇంటి పన్నుల వసూలు తీరును పరిశీలించారు. పన్నుల వసూలు నత్తనడకన ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలలో బృందాలుగా ఏర్పడి ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. ప్రతీ బృందం రూ.లక్షకు పైగా వసూలు చేయాలన్నారు. టాక్స్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పన్నుల వసూలు లక్ష్యాన్ని చేరకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంపీవో మారుతీ, తదితరులున్నారు.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

నిజామాబాద్ రూరల్, మార్చి4: సారంగపూర్‌లోని జిల్లా జైలులో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్న దుండగుల తిరుమలయ్య (28) (ఖైదీ నెంబర్ 8652) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్‌కుమార్ తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన తిరుమలయ్య (28) దొంగతనం కేసులో జనవరి నెలలో జిల్లా జైలుకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి అండర్ ట్రయల్ ఖైదీగా జైలులో ఉన్నాడు. మద్యానికి బానిసయ్యాడని, తిరుమలయ్య జైలులో మద్యం కోసం ప్రతీరోజు తిప్పలు పెట్టేవాడని జైలు సిబ్బంది తెలిపారు. సోమవారం ఉదయం 4 గంటలకు కాలకృత్యాలు తీసుకుని తిరిగి తన బ్యారక్‌వెళ్లి నిద్రపోయాడని తోటి ఖైదీలు తెలిపారు. కొద్దిసేపటితర్వాత తోటి ఖైదీలు పిలిస్తే పలకకపోవడంతో జైలు అధికారులకు సమాచారం అందించారు. దీంతో జైలు అధికారులు చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తిరుమలయ్య మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. తిరుమలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అతని బంధువులకు అప్పగించినట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ తెలిపారు.

'అంగన్‌వాడీలను దొంగలుగా చిత్రీకరించొద్దు'

పెద్దబజార్, మార్చి4: అంగన్‌వాడి ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరించేలా మాట్లాడడం సబబు కాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సీసీ టీవీ, బయోమెట్రిక్ విధానాన్ని అవలంబించాలని అన్నారు. సీఎం.రేవంత్‌రెడ్డి ఐసీడీఎస్ సమావేశంలో మాట్లాడారని వెంటనే పునఃసమీక్షించుకుని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఏర్గట్ల, మార్చి4: ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన నిధులలో నుంచి సోమవారం తాళ్లరాంపూర్ గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి మాట్లాడుతూ మండలాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.55 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఏర్గట్లకు రూ.20లక్షలు, తాళ్లరాంపూర్‌కు రూ.15లక్షలు, తొర్తికి రూ.5లక్షలు, బట్టాపూర్‌కి రూ.5లక్షలు, దోంచంద గ్రామానికి రూ.5లక్షలు, గుమ్మిర్యాల్‌కు రూ.5లక్షల నిధులను ఇన్‌చార్జీ మంత్రి జూపెల్లి కృష్ణారావు, బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌లు మంజూరీ చేయించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు గంగాప్ర సా ద్, రవిరెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, మార్చి4: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు ఉచిత మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీ పార్లర్ శిక్షణ, జ్యూట్ బ్యాగుల తయారీ, ఆర్టిఫిషియల్ జ్యుయలరీ తయారీ శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తిగల వారు డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో పరిధిలోని యువతులకు, నిరుద్యోగ మహిళలకు ఈ అవకాశం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. శిక్షణలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతితో పాటు శిక్షణకు కావాల్సిన అన్ని పరికరాలను ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ మహిళలు, యువతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 08461- 295428 నె ంబరుకుసంప్రదించాలని తెలిపారు.

చెరువును కబ్జాల నుంచి కాపాడండి

- ఎమ్మెల్యేను కోరిన గ్రామస్థులు

డిచ్‌పల్లి, మార్చి4: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల ఈదుల్ల చెరువును కొందరు కబ్జాలు చేస్తున్నారని, తక్షణమే వారిని అడ్డుకొని కబ్జాలను స్వాధీనం చేసుకోవాలని సోమవారం నడిపల్లి గ్రామ ప్రజలు ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే స్థానిక తహసీల్దార్ ప్రభాకర్‌ను పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. చెరువు భూములను సర్వే చేయించి హద్దులు నిర్ణాయించాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి4: అర్హులైన ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ద్వారా లబ్ధిపొందాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్‌ఎమ్మెల్యే కార్యాల యంలో ఆర్మూర్, ఆలూర్ మండలాలకు చెందిన 29మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అ తీతంగా పేదవారి ఆడ పిల్ల పెళ్లి కోసం ప్రభుత్వ సహాయం చేస్తోందన్నారు. ప్రభుత్వాలు మారినా పథకాలు అగవన్నారు. పథకాలలో లబ్ధి కోసం ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గజానంద్, ఆలూర్ ఆర్ఐ రఫీక్, అధికారులు, బీజేపీ నాయకులు పట్టణ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కలిగోట గంగాదర్, కొట్టాల సుమన్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

మాక్లూర్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పంపిణీ చేశారు. పేదల సహా యార్థం పంపిణీ చేస్తున్న చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటే శ్వర్‌రావు, ఎంపీడీవో క్రాంతి, వైస్‌ఎంపీపీ, గ్రామస్థులు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరామర్శించారు. ఆలూర్ మండల కేంద్రంలో గుండ గంగారాం, డీకంపల్లిలో శశివర్ధన్ కుటుంబాలను, పట్టణంలోని ఎంజే రమేష్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఆలూర్ మండల బీజేపీ అధ్య క్షుడు కొత్తూరు గంగాధర్, మల్లయ్య, డాక్టర్ అరుణ్, హరిష్, రాజేష్, రవీంధర్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో ఇద్దరు డిబార్

నిజామాబాద్‌అర్బన్, మార్చి4: జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో సోమవారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 57పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గణితం-1ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు మొత్తం 20189మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా 19,380 మంది హాజరుకాగా 809మంది గైర్హాజరయ్యారు. బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, బోధన్ విజేత జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులపై మాస్ కాపీయింగ్ కేసులు నమోదయ్యాయి. డీఈసీ కమిటీ-6, హెచ్‌పీసీ కమిటీ-9, ఫ్లయింగ్ సిట్టింగ్ బృందాలు 27, డీఐఈవో రఘురాజ్ 4పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

కోటగిరి, మార్చి 4: కోటగిరి మండల కేంద్రంలోని గుట్టపై నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై సోమవారం ఎస్సై సందీప్ దాడి చేశారు. ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేయడంతో పాటు రూ.19,640 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏకలవ్య మోడల్ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

ఇందల్‌వాయి, మార్చి4: మండలంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో గల సీట్లను భర్తీ చేయడానికి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీ.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థిని, విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను 22 ఫిబ్రవరి నుంచి మార్చి 22వ తేదీ వరకు ఉంటుందని, ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21న ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్లను పాటిస్తూ విద్యార్థుల ఎంపిక జరుగుతుందని పూర్తి వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కోటగిరి, మార్చి 4: పొతంగల్‌లోని పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు సోమవారం బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పొతంగల్ సాయిబాబా ఆలయం కల్యాణ మండపంలో పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి, పొతంగల్, జల్లాపల్లితో పాటు పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, షహీద్, గంగాధర్ దేశాయ్, మనోహర్, కొత్తపల్లి విండో అధ్యక్షుడు సునీల్‌కుమార్ ఉన్నారు.

ఫ్యాక్టరీ సెక్యూరిటీ గార్డుపై దాడి

బోధన్‌రూరల్, మార్చి4: పట్టణంలోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ సెక్యూరిటీగార్డు నర్సయ్యపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఫ్యాక్టరీ పరిధిలోని చెట్టు నుంచి చింతకాయలు దొంగిలిస్తుండగా సిబ్బంది అడ్డుకోవడంతో అతనిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. కేసుదర్యాప్తు చేస్తున్నామన్నారు.



జీరో బిల్‌ను ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

గృహజ్యోతి జీరో బిల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ

ఖిల్లా, మార్చి4: నగరంలో గృహజ్యోతి జీరో బిల్‌ను ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఆరు పథకాల్లో భాగంగా దీన్నిప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మొదటి విడతలో జీరోబిల్ రానివారు నిరాశపడొద్దని అన్నారు. రేషన్‌కార్డు ఉండి 200యూనిట్లలోపు వినియోగించిన ప్రతీవినియోగదారుడికి ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. జీరోబిల్ రానివారు మున్సిపల్ కార్పొరేషన్‌లో అందించాలన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్‌రావ్, ఏడీఈ తోటరాజశేఖర్, గంగారాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నగర అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గడుగుగంగాధర్, కార్పొరేటర్ మృదుల, పార్టీ నేతలు రత్నాకర్, బొబ్బిలిరామకృష్ణ, విపుల్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, బంటురాము, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

నిజామాబాద్ అర్బన్: నగరానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, నగర మేయర్ దండునీతుకిరణ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాల ద్వారా పెండ్లి చేసిన కుటుంబానికి ఆడబిడ్డ భారం కాకూడదని అన్నారు. నగరంలోని 316మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షపాతి అని పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరుగ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, న్యాలం రాజు, మాస్టర్ శంకర్, కేశ వేణు, మల్లేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం

ఖిల్లా, మార్చి4: నగరంలో మూడోటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మళ్లీ కత్తిపోట్ల కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన దస్తగిరి, ఖండోబాలు బతుకుతెరువు కోసం నగరానికి కూలీ పనుల కోసం వలస వచ్చారు. అద్దెకు ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డబ్బుల విషయంలో దస్తగిరి, ఖండోబాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం నగరంలోని రైల్వేలైన్ ప్రాంతంలో గల ఒక ప్రార్థణ మందిరం సమీపంలో దస్తగిరి తన వద్ద ఉన్న కత్తితో ఖండోబను దాడి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు అడ్డుకుని వెంటనే ఖండోబాను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఖండోబా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న మూడో టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ యోజనను సద్వినియోగించుకోవాలి

నిజామాబాద్‌అర్బన్, మార్చి4: ప్రధానమంత్రి సూర్యఘర్‌ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ గౌతం సూచించారు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ఈ పథకం ద్వారా 40శాతం సబ్సిడీ, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఈ పథకం ప్రారంభించామన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అర్హులైన వినియోగదారుల ఇండ్ల పై కప్పులపై సోలార్‌ప్లాంట్ అమర్చడం జరుగుతుందని తద్వార సౌర విద్యుత్ వినియోగంతో పాటు కరెంట్‌బిల్లు భారం తగ్గుతుందని ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'గృహజ్యోతి వర్తించనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి'

ధర్పల్లి, మార్చి4: గృహజ్యోతి పథకం వర్తించనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని మండల అధికారులు సూచించారు. అర్హులైన వారు మండలంలో 300 లకు పైగా ఉన్నారని, పథకం వర్తించని వారి కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హత కలిగి గృహజ్యోతి పథకం వర్తించనివారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంటు బిల్లు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదును జతచేసి మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని ఎంపీవో రాజేశ్ తెలిపారు. జీరో కరెంట్ బిల్లు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పన్నుల వసూళ్లపై ఘన్‌పూర్‌లో స్పెషల్ డ్రైవ్

డిచ్‌పల్లి, మార్చి4: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో పన్నుల వసూళ్లపై సోమవారం పంచాయతీ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ పన్నులను వసూళ్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సునీల్ తెలిపారు. గ్రామస్థులు పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రవి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని దర్గాలో ప్రార్థనలు

బోధన్‌రూరల్, మార్చి4: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవిరావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సనాపటేల్ దర్గాలో ప్రత్యేకప్రార్థనలు చేపట్టారు. సోమవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి బడాపహాడ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రివర్గ విస్తరణ చేపట్టే అంశంలో ఈసారి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకున్నట్లు నాయకులు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్ రోడేలతో కార్యకర్తలు తదిత రులు ఉన్నారు.

శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

బోధన్ రూరల్, మార్చి4: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు గణేష్ మహారాజ్ ఆధ్వర్యంలో గణపతి పూజ, లఘు రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజున వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా బోధన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.




ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం: ఎమ్మెల్యే



సంగంలో జీరో బిల్లును అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్, మార్చి4: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ మండలం సంగం గ్రామంతోపాటు పట్టణంలో పర్యటించారు. మండలంలోని సంగం గ్రామంలో జీరో కరెంటు బిల్లును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలన కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతీఒక్క కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు జీరో బిల్లులను అందజేశారు. అర్హులైన వారికి రూ.500కే గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నామన్నారు. బోధన్ నియోజక వర్గ అభివృద్ధే తమ ధ్యేయమని పార్టీలకు అతీతంగా గ్రామాలను, పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు ధూప్‌సింగ్, జావీద్‌లతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా వేసి వారిని ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవకమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన కర్నెహన్మంత్‌రావును అభినందించారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ గంగా శంకర్, మండలాధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్న రవి, ఆది నారాయణ, అల్లె రమేష్, అల్లె జనార్ధన్, గణపతి రెడ్డి, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, ధూస్‌సింగ్, జావిద్, అబ్దుల్లా, పాషా మొయినొద్దీన్, నవీన్ తదితరులు ఉన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నగర మేయర్

బాపూజీ వచనాలయ నూతన భవనానికి భూమిపూజ

నిజామాబాద్ అర్బన్, మార్చి4: నగరంలోని బాపూజీ వచనాలయ నూతన భవన నిర్మాణానికి సోమవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ అర్వింద్, మేయర్ దండునీతు కిరణ్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ భూమిపూజ చేశారు. బాపూజీ వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం, ఇతర కార్యవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధిగాంచిన బాపూజీ వచనాలయ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ప్రాచీన చరిత్ర కలిగిన లైబ్రరీ ఆధునీకరించాలని, ఇందుకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. తమ ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ నిధుల నుంచి బాపూజీ వచనాలయ అభివృద్ధికి సహకరిస్తామని నేతలు హామీఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, తదితరులున్నారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, మార్చి4: పట్టణంలోని నవనాథసిద్ధులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపై రామాలయం, దురా మాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద హనుమాన్ ఆలయం, శివాలయంలో సిద్ధేశ్వర ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో ఆర్మూర్ భజన మండలి సభ్యులు భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు. అంతాజీ మదన్‌మోహన్, గొల్ల ఆరవ్, మీసాల అమాన్‌రాజ్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అలయ కమిటీసభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, బొండ్ల ఆనంద్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,500	రూ.59,500	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆపరేషన్ వాలెంటైన్ (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-2 : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (10.05)
: చారి 111 (1.35, 10.10)
: వ్యూహం (4.25)
: భూతద్దం భాస్కర్ నారాయణ (7.10)
స్క్రీన్-3 : భూతద్దం భాస్కర్ నారాయణ (12.10)
: దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.10, 6.40, 10.10)
స్క్రీన్-4 : ఇంటి నెంబర్-13 (1.05)
: కిక్ (3.50)
: ఆర్టికల్ 370 (హిందీ) (7.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : వ్యూహం (10.55)
: ఊరుపేరు భైరవకోన (1.30)
: సమరసింహారెడ్డి (4.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (7.30, 10.30)
స్క్రీన్-2 : చారి 111 (11.00)
: హనుమాన్ (1.30, 4.30)
: వ్యూహం (7.30)
: కిక్ (10.30)
స్క్రీన్-3 : మా ఊరి రాజారెడ్డి (10.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (1.30)
: భూతద్దం భాస్కర్ నారాయణ (4.20, 10.20)
: ఊరుపేరు భైరవకోన (7.20)

దేవి : ఆపరేషన్ వాలెంటైన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : సమరసింహారెడ్డి (11.00, 9.15)
: కిక్ (2.15, 6.15)
నటరాజ్ : ఇంటి నెంబర్-13 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్